క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



కత్తిమండ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలంతా ఆకర్షితులవుతున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. గొందికి చెందిన బొమ్మిడి నరసింహస్వామి, చింతలమోరికి చెందిన నల్లి సుధాకర్‌లు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

దారి కాసి... యువకుడిపై దాడి

అంబాజీపేట: స్థానిక నాలుగు రోడ్ల సెంటర్లో ఓ యువకుడిపై ముగ్గురు యువకులు సినీ ఫక్కీలో దాడికి పాల్పడ్డారు. దీనికి సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబాజీపేటకు చెందిన గుత్తుల నాగవెంకట సత్యసాయి సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో స్థానిక సెంటర్‌కు మందులు కొనుక్కొనేందుకు బైక్‌పై వచ్చాడన్నారు. ఆ సమయంలోనే అదే గ్రామానికి చెందిన గుబ్బల సురేష్‌గోపి, కుడుపూడి రవితేజ, చందులు సత్యసాయిపై దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్రగాయాలైన సత్యసాయిని 108 అంబులెన్స్ సాయంతో అమలాపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

45 మందికి కంటి పరీక్షలు

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవా రం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు చంటిబాబు బృందం 45 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 10 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు.

ఈయూ ఆవిర్భావ దినోత్సవం

రాజోలు: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 7వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం యూనియన్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. యూనియన్ డిపో అధ్యక్షుడు కేహెచ్ రావు అధ్యక్షతన యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శిర్శి జి.చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షురాలు జి.అనంతలక్ష్మి, డిపో కార్యదర్శి ఎంఎస్ఆర్ మూర్తి, గౌరవ అధ్యక్షుడు ఎంఎ రావు, పీవీ బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా సర్టిఫికెట్లు

పి.గన్నవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంకా మిగిలిన అర్హులందరికీ సంక్షేమ పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లను ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని మానేపల్లిలో సర్పంచ్ ప్రత్తిపాటి ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే చిట్టిబాబు 765 సర్టిఫికెట్లను అందజేవారు. ఎంపీడీఓ ఎం.భారతి, డీటీ బి.గోపాలకృష్ణ, నాయకులు యల్లమెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే మానేపల్లిలో సర్పంచ్ పితాని చంద్రకళ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్షలో 906 సర్టిఫికెట్లను తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అందజేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి ప్రతిరూపాలు వలంటీర్లు

వలంటీర్లు పేరుకు తగ్గట్టుగా సేవాభావంతో పని చేస్తున్నారు. వేకువజామునే వృద్ధుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తున్నారు. అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. గోదావరి వరదలతో పాటు కోవిడ్ సమయంలోను వలంటీర్లు అందించన సేవలు ప్రశంసలందుకున్నాయి. ఇతర రాష్ట్రాలు సైతం వలంటీర్ వ్యవస్థ తమకు ఆదర్శమంటూ ప్రశంసలు కురిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు వలంటీర్ల సహాయంతోనే పని చేస్తున్నాయన్నది నగ్న సత్యం. ప్రభుత్వం అందించే గౌరవ వేతనంతోనే విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు దానికి మించిన సేవలందిస్తున్నారు. వివిధ వర్గాలకు వలంటీర్లు అందించే సేవలను పరిశీలిద్దాం.

విశేషమైన సేవలందిస్తూ...

మామిడికుదురు: పెదపట్నం గ్రామానికి చెందిన వలంటీర్ గోగు క్రాంతికుమార్ విశేషమైన సేవలందిస్తున్నాడు. ఇతను 2020 ఆగస్టులో సంభవించిన గోదావరి వరదతో పాటు 2022 జూలై, ఆగష్టు నెలల్లో సంభవించిన వరదల్లో సైతం వరద బాధితులకు సహాయం అందించడంలో ముందున్నారు. ప్రభుత్వం అందించిన కూరగాయలు, నిత్యావసరాలు, తాగు నీరు, పాలు, భోజనం ప్యాకెట్లు, బిస్కెట్లు బాధితులకు సకాలంలో పంపిణీ చేశాడు. 50 కుటుంబాలకు చెందిన 180 మందికి రాత్రనక పగలనక సేవలందించారు. దీంతో పాటు ఉద్యోగులకు వరదల సమయంలో తోడుగా ఉండి విధులకు తీసుకువెళ్లాడు. బాధితులను పడవల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించడంలో కూడా కాంత్రికుమార్ విశేషమైన సేవలందించాడు.

మేమున్నామంటూ భరోసా...

బి.దొడ్డవరం గ్రామానికి చెందిన వలంటీర్ కోళ్ల సురేష్ గత ఏడాది గోదావరి వరదల్లో సాహసమే చేశాడు. గ్రామం మొత్తం వరద నీటిలో మునిగిపోయింది. ఎటు చూసినా గోదావరి వరద నీరే. ఇళ్లన్నీ ముంపు బారిన పడ్డాయి. ఆ పరిస్థితుల్లో బాధితులకు అండగా మేమున్నామంటూ భరోసా కల్పించాడు. మూడడుగుల వరద నీటిలో ప్రతి ఇంటికీ నడిచి వెళ్లి ఆహార పొట్లాలు అందించాడు. ఏ మాత్రం ఆలస్యం కాకుండా సకాలంలో ఆహారం అందజేసి బాధితుల ప్రశంసలందుకున్నాడు. దీంతో పాటు 2020 ఆగష్టు వరదల్లో కూడా సురేష్ అందించిన సేవలు ప్రశంసలందుకున్నాయి. కోవిడ్ సమయంలోను కోవిడ్ బారిన పడిన వారికి సహాయం అందించడంలో కూడా సురేష్ పాత్ర గణనీయమైనది.



పెదపట్నంలో వరద బాధితులకు కూరగాయాలు అందిస్తున్న వలంటీర్ క్రాంతికుమార్



బి.దొడ్డవరంలో బాధితులకు పంచేందుకు కూరగాయలు లోడు చేస్తున్న వలంటీర్ సురేష్

పింఛన్లు అందజేస్తూ...



పెదపట్నంలంకలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్నేహ

పెదపట్నంలంకకు చెందిన గెద్దం స్నేహ డిగ్రీ వరకు చదువుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన స్నేహ కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా వలంటీర్‌గా చేరింది. అప్పటి నుంచి తన విధులను సక్రమంగా నిర్వహిస్తోంది. ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారు జామునే అవ్వా తాతలకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు అందజేస్తోంది. దీంతో పాటు పలు రకాల సర్వేలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన అర్హుల వివరాలు సేకరిస్తూ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరే విధంగా విధులు నిర్వహిస్తోంది.

కోవిడ్ బాధితుల సేవలో...

పెదపట్నంలంక గ్రామంలోని గిడుగువారిపాలానికి చెందిన వాలంటీర్ గిడుగు బాబి కోవిడ్ బాధితులకు సహాయం అందించడంతో పాటు గోదావరి వరదల సమయంలోను ఎన్నో సేవలందించాడు. కుటుంబ సభ్యులు సైతం కోవిడ్ బాధితుల దగ్గరకు వెళ్లేందుకు భయపడుతున్న సమయంలో వారికి మందులు అందించడంతో పాటు నిత్యాసరాలను అందించి వారికి అండగా నిలిచాడు. గోదావరి వరదల సమయంలో కూడా రాత్రనక పగలనక బాధితులకు కూరగాయలు, నిత్యావసరాలు అందించి మన్ననలందుకున్నాడు.



పెదపట్నంలంకలో కూరగాయలు అందిస్తున్న గిడుగు బాబి

మానవత్వాన్ని చాటుకుంటున్నారు



కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో సత్యనారాయణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ మురళి

పాశర్లపూడికి చెందిన కందికట్ల మురళి వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల పింఛన్ల పంపిణీ సమయంలో అదే గ్రామానికి చెందిన కొప్పాడి సత్యనారాయణ అనే వికలాంగుడు కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. స్థానికంగా అందుబాటులో లేడు. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను వారం రోజుల వరకు ఇంటికి వచ్చే పరిస్థితి లేదు. వలంటీర్ మురళి వికలాంగుడైన సత్యనారాయణ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నాడు. సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకినాడ వెళ్లి రూ.మూడు వేల పింఛన్ అందించి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఎంతో సంతోషించారు.

పురోహితుల సరఫరాకు వేలం తగదు



మేడపాటి లక్ష్మణరావు

ఆలమూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం కొండపై శుభకార్యాలు చేయించేందుకు అవసరమైన పురోహితుల (బ్రాహ్మణులు) సరఫరాకు బహిరంగ వేలం నిర్వహించడాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పురోహిత సంఘ అధ్యక్షుడు మేడపాటి లక్ష్మణరావు ఖండించారు. రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆదేశాల మేరకు మండలంలోని పెదపళ్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పురోహితుడు ఎక్కడికైనా వెళ్లి శుభకార్యాలు నిర్వహించే స్వేచ్ఛ ఉన్న పురోహితులపై ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ఆచార సంప్రదాయాలను విస్మరించి ఇలాంటి హిందూ వ్యతిరేక నిర్ణయాలు తీసుకొంటే హిందూ సమాజం హర్షించదని హితవు పలికారు. ఇకనైనా వేలం విధానానికి స్వస్తి పలికాలని లేదంటే బ్రాహ్మణ సమాఖ్య తీవ్రంగా ఉద్యమిస్తుందని ఆయన హెచ్చరించారు.

ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణ

ఆలమూరు: నిరుద్యోగ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపాధి కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనునట్లు మండల మహిళ సమాఖ్య ఏపీఎం ఎం.ధనరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో సీడాప్ ప్రోగ్రాం ద్వారా ఆటోమోటివ్, ఆటోమేషన్స్ అండ్ ఆటోబోటిక్ ఇంజినీర్‌తో పాటు ఎంబెడెడ్ ప్రాడక్ట్ డిజైనర్ విభాగాల్లో మూడు నెలల పాటు శిక్షణను ఇవ్వనున్నారన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 13 నుంచి ప్రారంభమయ్యే శిక్షణ తరగతులను నేరుగా హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు సమీప మండల మహిళ సమాఖ్య అధికారులను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం, యూనిఫాం, శిక్షణ మెటీరియల్ అందించనున్నారన్నారు. శిక్షణ అనంతరం శిక్షణ సర్టిఫికెట్లు అందజేసి ఉపాధి కల్పించనున్నామన్నారు.

బస్టాండ్ ఖాళీ స్థలాలు లీజుకు

అంబాజీపేట: అంబాజీపేట, ముమ్మిడివరం ఏపీఎస్ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఉన్న ఖాళీ స్థలాలు నిబంధనల ప్రకారం లీజుకు ఇస్తామని అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి చెప్పారు. ఆయన మాట్లాడుతూ అంబాజీపేట బస్టాండ్ ఆవరణలో 2730 చదరపు గజాలు 15 ఏళ్లకు అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు టెండర్లు పిలుస్తామన్నారు. ముమ్మిడివరం బస్టాండ్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాలు మొదటి బిట్ 2162 చదరపు గజాలు, రెండవ బిట్ 1751 చదరపు గజాలను కూడా అద్దెకు ఇస్తామన్నారు. ఈ నెల 17 లోగా టెండర్ ఫారాలను ఆర్టీసీ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 20 లోగా విజయవాడలో అందజేయాలన్నారు.

లోకేష్‌కు సంఘీభావంగా పాదయాత్ర

మామిడికుదురు: టీడీపీ నేత నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లు పూర్తైన సందర్భంగా మంగళవారం ఆ పార్టీ నేతలు పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్ నుంచి మామిడికుదురు బస్టాండ్ కూడలి వరకు పాదయాత్ర చేశారు. లోకేష్‌కు సంఘీభావంగా ఈ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, పార్టీ నేతలు గంటి హరీష్‌మాథుర్, డొక్కా నాథ్‌బాబు, మొల్లేటి శ్రీనివాస్, బోణం బాబు, చుట్టుగుళ్ల కిశోర్, సూదా బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనపై పూర్తి సంతృప్తి



శృంగవరప్పాడులో పథకాల గురించి మహిళకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం శృంగవరప్పాడులో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. స్థానికులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని, ఆయనకు తోడుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ రావి నాగ వెంకట లక్ష్మీదేవి, ఎంపీటీసీ యెనుముల కొండమ్మ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు మద్దాల భాను, వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు జాన శంకరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు ముప్పర్తి త్రిమూర్తులు, కూనపరెడ్డి రాంబాబు, ఈద రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దళితులకు దళితసేస్తం పథకం ప్రవేశపెట్టి దళితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గెడ్డం బాలరాజు, ఎమ్మెల్యే వరప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 60 శాతం సబ్సిడీపై వ్యక్తిగత రుణాలు మంజూరు చేసేలా చూడాలని, జగనన్న విదేశీ విద్యా పథకంలో దళిత విద్యార్థులకు మేలు చేసేలా నిబంధనలు సడలించేలా చూడాలని ఆ పత్రంలో ఆయన కోరారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

అంబాజీపేట: వివాహితను అదనపు కట్నం కోసం వేధిస్తుడటంతో భర్తతో పాటు మరో ముగ్గురిపై అంబాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మాచవరానికి చెందిన పిల్లి శ్యామలకు కాకినాడకు చెందిన పిల్లి వెంకటేశ్వరరావుకు 2013లో వివాహం జరిగింది. అప్పటి నుంచి కొన్నేళ్ళపాటు వీరి కాపురం సజావుగా సాగింది. గత కొన్ని నెలల నుంచి అదనపు కట్నం తీసుకురావలంటూ భర్త వెంకటేశ్వరరావు, అత్తమామలు పిల్లి విజయలక్ష్మి, సుదర్శనరావు, ఆడపడుచు వెంకట పద్మజలు వేధిస్తున్నారన్నారు. బాధితురాలు శ్యామల ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పి.భగవాన్నారాయణ తెలిపారు.

కట్టుంగ ఆలయ అన్యాక్రాంత భూములపై చర్యలు

ఆత్రేయపురం: మండలంలోని కట్టుంగలో ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన అన్యాక్రాంతమైన భూములకు నోటీసులు జారీ చేసినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. 2015లో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు 18.05 ఎకరాలకు కౌలు వేలం నిర్వహిన్నారు. ఇటీవల ఆలయ భూములను గుర్తించామని ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విచారణ కమిటీ నియమించినట్లు తెలిపారు. అలాగే నోటీసులు జారీ చేశామన్నారు. త్వరలో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం



కె.పెదపూడిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: జగనన్న సురక్ష ద్వారా అర్హులందరికీ నూరు శాతం మేలు జరుగుతోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చిరతపూడి, కె.పెదపూడి గ్రామాల్లో ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారుల పర్యవేక్షణలో సర్పంచ్ కోట బేబిరాణి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చిరతపూడిలో 1135, కె.పెదపూడిలో 1369 కుల, ఆదాయ, 1బి, తదితర దరఖాస్తులు వచ్చాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, జీసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సొసైటీ చైర్మన్ బొంతు శ్రీనివాస్, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: వివిధ పథకాలు ద్వారా లబ్ధిదారులకు 100 శాతం లబ్ధిని చేకూర్చేందుకే జగనన్న పథకం ద్వారా 11 రకాలను సర్వీసులను ఉచితంగా అందజేస్తు సర్టిఫికేట్లను అందజేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని మాగాం, మడుపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచులు కాశీ సత్యనారాయణ మూర్తి, నిమ్మకాయల వెంకటలక్ష్మిల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పేదలకు జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాలు సర్టిఫికెట్ల ఉచితంగా అందిస్తున్నారు. జగనన్న సురక్ష పథకాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, మండల ప్రత్యేక అధికారి వై. సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలంతా సీఎం జగన్‌కే మద్దతు

పి.గన్నవరం: కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌కే రాష్ట్ర ప్రజలంతా మద్దతు పలుకుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని నాగుల్లంకలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. సొసైటీ కమిటీ చైర్మన్ భీమాల సూరిబాబు, పార్టీ నాయకులు మంగం చిట్టిబాబు, కారుపల్లి శ్రీను, బొక్కా ఏడుకొండలు, చికిలే వెంకటేశ్వరరావు, చికిలే ప్రసాద్ తదితరులతో చిట్టిబాబు ఇంటింటికీ ప్రజలను కలుసుకున్నారు. జగన్ పాలనలో కలిగిన అందిన పథకాలను కుటుంబాల వారీగా చిట్టిబాబు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు కల్పించినా సీఎం జగన్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని అన్నారు. స్థానిక సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు చిట్టిబాబు ఆదేశాలు ఇచ్చారు. పార్టీ నాయకులు గొల్లమందల మల్లేశ్వరరావు, బళ్ల జాన్, బత్తుల వీవీ సత్యనారాయణ, యల్లమెల్లి అంబేద్కర్ పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన



పాదలాడ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు



తాటిపాక కూడలిలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



కొత్తపేటలో ధర్నా చేస్తున్న వలంటీర్లు

రాజోలు: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పాదలాడ సెంటరులో ఆ గ్రామ వలంటీర్లు పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వలంటీరు వ్యవస్థపై విమర్శలు చేసిన పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో వలంటీర్ల పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన తెలిపారు. పవన్ కల్యాణ్ చిత్రపటాలను దగ్ధం చేసి వ్యతిరేకంగా నినాదించారు. వలంటీర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

అంబాజీపేట: వలంటీర్లను కించపరచి నీచ రాజకీయానికి పవన్‌కల్యాణ్ పాల్పడటం సిగ్గుచేటని పలువురు వలంటీర్లు తీవ్రంగా ఖండించారు. మండలంలోని గంగలకుర్రు, పుల్లేటికుర్రు, వక్కలంక తదితర గ్రామాల్లో సచివాలయాల వద్ద బ్లాక్ రిబ్బన్‌లను ధరించి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నిత్యం ప్రజా సేవలో ఉంటూ వృద్ధులు, దివ్యాంగులకు సేవలందిస్తున్న తమను కించపరిచేలా మాట్లాడంపై తీవ్రంగా మండిపడ్డారు. పవన్ డౌన్ డౌన్, నీచ రాజకీయాలు చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారంటూ నినాదాలు చేశారు.

మామిడికుదురు: రాజోలు మండలం తాటిపాక కూడలిలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మొగలికుదురు, గెద్దాడ, తాటిపాక గ్రామాలకు చెందిన వలంటీర్లు పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, తమకు క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. సేవాభావంతో ఎంతో మందికి అండగా నిలుస్తున్న తమను కించపర్చే విధంగా మాట్లాడటం తగదని వలంటీర్లు మండిపడ్డారు.

కొత్తపేట: పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై కొత్తపేట మండలంలోని వలంటీర్లు కదం తొక్కారు. భారీ నిరసన ర్యాలీ, ధర్నా జరిపారు. మంగళవారం సాయంత్రం మండలంలో 10 గ్రామాల నుంచి వలంటీర్లు ఎంపీపీ కార్యాలయం ప్రాంగణంలో శ్రీకృష్ణదేవ రాయ సభా ప్రాంగణానికి చేరుకుని సమావేశమయ్యారు. ఆ మేరకు అక్కడి నుంచి నిరసన నినాదాలతో ఫ్లెక్సీ, ప్లకార్డులు చేతపట్టి, పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్థానిక పాతబస్టాండ్ సెంటర్ వరకూ భారీ ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. తమకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పి.గన్నవరం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని వలంటీర్లు మంగళవారం పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్లో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. తక్షణమే పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లపై చేసిన ఆరోపణలను నిరూపించాలని అన్నారు. ఇకపై నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆందోళనలో వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలమూరు: వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలకు నిరసనలు కొనసాగుతున్నాయి. పవన్ సత్వరమే క్షమాపణ చెప్పాలని మండలంలోని చింతలూరు, మూలస్థాన అగ్రహారం గ్రామాలకు చెందిన వలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామాల్లో ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసన ప్రదర్శనలు చేశారు. క్షేత్ర స్థాయిలోని వాస్తవాలను గమనించకుండా రాజకీయాల కోసం వలంటీర్లపై అనుచితంగా ప్రవర్తించడం దారుణమని వ్యాఖ్యానించారు.

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంకలో మండల వలంటీర్లు పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై తీవ్ర ఆందోళన చేపట్టారు. ఉదయం మండలంలోని పలు గ్రామాల నుంచి వలంటీర్లు బొబ్బర్లంక తరలివెళ్లి నిరసన కార్యక్రమం చేశారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేసి నినాదాలు చేశారు. పవన్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని వలంటీర్లకు క్షమాపణ చెప్పకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



గంగలకుర్రులో బ్లాక్ రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు



పి.గన్నవరంలో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



చింతలూరులో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసన తెలుపుతున్న వలంటీర్లు